క్లుప్తంగా

స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న చిక్కాల, సముద్రపు రామరావు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో ఉన్న గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కేవీ రమణ రాజును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం గ్రంథాలయ భవనం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని, సొంత భవన సదుపాయం కోసం ఐదు సెంట్ల స్థలం కేటాయించాలని కోరారు. వారి వెంట ఏఎంసీ డైరెక్టర్ పోలుబోతు నారాయణమూర్తి ఉన్నారు.

పాత వస్తువుల సేకరణ

నెల్లిమర్ల: నగర పంచాయతీలో రెడ్యూస్ - రీసైకిల్ - రీయూజ్ నినాదంతో పది రోజుల పాటు పాత వస్తువులను సేకరించనున్నట్లు కమిషనర్ పి.బాలాజీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడతామన్నారు. దీనిలో భాగంగా మే 20 నుంచి 30వ తేదీ వరకు రీసైకిలింగ్ ప్రక్రియకు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్ తదితర వస్తువులను పెద్ద ఎత్తున సేకరించనున్నట్లు చెప్పారు. సేకరణ నిమిత్తం నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణవాసులు ఆ స్టాల్ వద్ద పాత వస్తువులను అందజేయాలని కమిషనర్ సూచించారు.

విద్యుత్ సమ్యలపై 1912 నంబర్‌కు సంప్రదించాలి

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో ఓల్టేజ్, ట్రిప్ అవ్వడం, తదితర విద్యుత్ సమస్యల పరిష్కారానికి ట్రోల్ ఫ్రీ నంబర్ 1912కు సంప్రదించాలని విద్యుత్ శాఖ ఈఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ సమయంలోనైనా ట్రోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

కుర్చీల వితరణ



లైబ్రేరియన్ మహేష్‌కు కుర్చీలు అందిస్తున్న దాత కర్రి జగదీష్

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి డెంకాడ గ్రామానికి చెందిన కర్రి జగదీష్ రూ.3,500 విలువ చేసే ఆరు కుర్చీలను సోమవారం వితరణగా అందించారు. ఈ మేరకు దాతను లైబ్రేరియన్ వై. మహేష్ దాతను అభినందించారు.


చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు, తదితరులు

విజయనగరం క్రైమ్: వేసవిలో వాహనదారులు, బాటసారులకు ఎండదెబ్బ నుంచి ఉపశమనం కలిగించేందుకు స్థానిక పీటీసీ మెయిన్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యం వందలాది మంది పాదచారులు, వాహనచోదకులు పీటీసీ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారని, అటువంటి వారికోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ వీవీ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

శంకు,చక్ర, నామాల ఏర్పాటు



రామతీర్థం ఆర్చ్‌కు ఏర్పాటు చేసిన శంకు, చక్ర, నామాలు

నెల్లిమర్ల: పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌లో ఉన్న దేవస్థానం ఆర్చ్‌కు శ్రీవారి శంకు, చక్ర, నామాలను సోమవారం ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన బూర రాంబాబు అనే భక్తుడు రూ. 18 వేలతో వీటిని ఏర్పాటు చేయడమే కాకుండా ఎల్‌ఈడీ విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించారు. ఏర్పాటు పనులను శ్రీరామతీర్థం సేవా సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



ధర్మపురిలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

నగరంలోని 30వ డివిజన్ ధర్మపురి ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ధర్మపురి ప్రాంతంలోని పలు వీధుల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును వివరిస్తూ.. లబ్ధిదారులకు ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించే బుక్‌లెట్లను అందజేశారు. స్థానిక సమస్యలుంటే తెలియజేయాలని కోరగా.. తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని పలువురు మహిళలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తవుతుందని.. అదేవిధంగా ముషిడిపల్లి నుంచి ప్రత్యేక పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. అలాగే కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు మాట్లాడుతూ, గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ధర్మపురి ప్రాంతం అభివద్ధికి నోచుకోలేదన్నారు. శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామి ఎన్నికైన తర్వాత ఒక్కొక్క సమస్య పరిష్కరిస్తూ ధర్మపురి ప్రాంతాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని కొనియాడారు. గత టీడీపీ నాయకుల నిర్లక్ష్యం కారణంగా నగరం అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. మాట తప్పని మడమ తిప్పని నేతగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, అలాగే రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ఆదర్శ పాలనకు చిరునామాగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్ మారెం బాలబ్రహ్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పూసర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు సువ్వాడ జయరాం, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు



విద్యార్థులతో కథలు చెప్పిస్తున్న ఉపాధ్యాయుడు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు సోమవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా పలువురు ఉపాధ్యాయులు పుస్తక సమీక్ష, కథా సంకలనాలు, ఇండోర్ గేమ్స్, క్రాఫ్ట్ అంశాలపై విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. లలిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తరగతుల్లో సహాయ లైబ్రేరియన్ లక్ష్మి, ఉపాధ్యాయులు పి.భాస్కర్, ఆర్.చిట్టిబాబు, వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

17న పర్యావరణ పరిరక్షణపై సైకిల్ ర్యాలీ

• కాలుష్య నియంత్రణ మండలి ఈఈ టి.సుదర్శనం



విజయనగరం రూరల్:

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ లైఫ్' కార్యక్రమంపై ఈ నెల 17న కార్పొరేషన్ పరిధిలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ బి.సుదర్శనం తెలిపారు. ప్రకృతితో మమేకమయ్యే జీవనశైలిని ఏర్పరుచుకునే దిశగా ప్రజలను సమాయత్తం చేయడమే ఈ ఉద్యమం ముఖ్యోద్దేశమని ఆయన తెలిపారు. జాతీయస్థాయిలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా వంద కోట్ల మంది భారతీయులను ఈ కార్యక్రమం కోసం సమీకరించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇంధన పొదుపు, జల సంరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, సుస్థిర ఆహార విధానాలను పాటించడం, వ్యర్థాలను తొలగించడం, ఇ-వ్యర్థాల తగ్గింపు వంటి ఏడు అంశాలపై దృష్టి సారించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తుల జీవనశైలిలో మార్పు తేవడంతో వాతావరణ మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ స్పోర్ట్ కాంప్లెక్స్ నుంచి ఉదయం 6.30 గంటలకు ర్యాలీ ప్రారంభమై గంటస్తంభం, అంబేడ్కర్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మయూరి జంక్షన్ మీదుగా రైల్వేస్టేషన్‌కు 7.30 గంటలకు చేరుతుందని వివరించారు. కార్యక్రమంలో యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈఎంఎంఎస్ యాప్‌లో మస్తర్లు అప్‌లోడ్ చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

మెరకముడిదాం: మండలంలో పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పంచాయతీ కార్యదర్శులు తనిఖీలు చేసి వేతనదారుల మస్తర్లను ఈఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓ పి.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఉపాధి పనుల్లో పాల్గొంటున్న ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన గ్రూపులు, దివ్యాంగుల గ్రూపుల భాగస్వామ్యం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ వేతనదారుడికి సగటున రోజుకి రూ.260 తక్కువకాకుండా వేతనం వచ్చే విధంగా రెండుపూటలా పనులు చేయించాలని సూచించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే మండలంలో అన్ని గ్రామాల్లో జల జీవన్ మిషన్ పథకం పనులు పూర్తిచేసి, జూన్ నెలాఖరుకు ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి హౌసింగ్ ఏఈ ఎం.వి. రమణ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను దశల వారీగా పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. అలాగే విద్యాశాఖాధికారులతో సమన్వయం చేసుకుని నాడు-నేడు పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు.

ప్రభుత్వ కాలేజీలో నాణ్యమైన బోధన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకుడు వెంకటేశ్వర్లు

గజపతినగరం: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు యు.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా కళాశాలలో కోట్లాది రూపాయల నిధులతో అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా విద్యాబోధన అందజేస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో ఉన్న కోర్సులు, వసతులు, బోధనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

బొండపల్లి: మండల కేంద్రమైన బొండపల్లి నుంచి బోడసింగిపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వరకు జాతీయ రహదారి-26కు ఆనుకొని ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బగ్గా ఎర్రయ్య, బగ్గా ఆదినారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన స్పందనలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, అధికారులకు వినతిపత్రం అందజేశారు. అలాగే కనిమెరక గ్రామ రెవెన్యూ పరిధిలో సీతారామ సాగరంతో పాటు, విజయరామ సాగరం క్రింద డీపట్టా భూముల ఆక్రమణలపై విచారణ చేసి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సి.హెచ్.సుగుణకరరావు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మన్ కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న బూరాడపేట గ్రామస్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బూరాడపేటలో విధులు నిర్వహిస్తూ జూనియర్ లైన్‌మన్ శివ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో శివ కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామస్తులు, యువత విరాళాలు సేకరించి, రూ. 55 వేలు పోగుచేసి సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు జరజాపుపేటలో అందజేశారు. కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

ప్రతికూల వార్తలపై విచారణాధికారిగా ఎఫ్‌ఎస్‌ఓ నూకరాజు

విజయనగరం అర్బన్: వివిధ దినపత్రికల్లో వస్తున్న ప్రతికూల వార్తల పట్ల కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ స్పందించారు. ఇలాంటి వార్తల్లోని నిజనిజాలను నిగ్గుతేల్చేందుకు, విచారణాధికారిగా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి నూకరాజును నియమించారు. ఇకనుంచి రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖలు, అధికారులపై వచ్చే ముఖ్యమైన ప్రతికూల వార్తలు, కథనాలు, ఆరోపణలపై ఆయన సంబంధిత శాఖలను విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తారు.

23న మండల సమావేశం

మెరకముడిదాం: ఈనెల 23న ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, పరిషత్ సభ్యులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

40 మద్యం సీసాలు స్వాధీనం

బొండపల్లి: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోద చేసినట్లు ఎస్సై రవి తెలిపారు. మండలంలోని కొత్తపాలెంతో పాటు మరో మూడు గ్రామాల్లో సోమవారం దాడులు చేశారు. ముగ్గురు వ్యక్తుల నుంచి 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోద చేసినట్లు చెప్పారు.

రూ.35 లక్షలతో తారురోడ్డు నిర్మాణం

దత్తిరాజేరు: దత్తిరాజేరు గ్రామానికి వెళ్లే తారురోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.35 లక్షలు నిధులు మంజూరు చేసిందని పీఆర్ జేఈ అప్పలనాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఏఎంసీ నిధులు రూ.35 లక్షలతో తహసీల్దార్ కార్యాలయం నుంచి రాజుల ఇంటి వరకు తారురోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ రోడ్డు పూర్తిగా పాడవ్వడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించారని మాజీ సర్పంచ్ మహదేవ్ ఫణీంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి అప్పలనాయుడు తెలిపారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



తాగునీటి సరఫరాపై జేఈతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

పూసపాటిరేగ: మండల పరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ జి. రామారావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలోని 28 పంచాయతీలలో గల వాటర్‌స్కీమ్‌లపై పర్యవేక్షణ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అలేఖ్యను ఆదేశించారు. కోనాడ గ్రామంలో అనుమతి లేకుండా చంపావతి నది నుంచి ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్, హెల్త్, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ బెల్లం కొనుగోలు చేయాలి



బెల్లం దిమ్మలతో రైతులు

విజయనగరం అర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ముందుగా ఇచ్చిన హామీ మేరకు సేంద్రియ చెరకు బెల్లం దిమ్మలను కొనుగోలు చేయాలని బొబ్బిలి మండలం కోమటపల్లి, బాడంగి మండలం ముగడ గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మిని విజయనగరంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, జిల్లా వ్యసాయ సాధికార సంస్థల అధికారులు గ్రామానికి వచ్చి సేంద్రియ ఎరువులతో పండించిన చెరకు బెల్లంను తిరుమల తిరుపతి దేవస్థానం వారు కొనుగోలు చేస్తారని చెప్పడంతో సాగు చేశామని చెప్పారు. వారు నిర్దేశించిన పరిణామాల్లో బెల్లం దిమ్మలు తయారుచేశామని, అయితే ఆరు మాసాలు పూర్తయిన ఇప్పటికీ కొనుగోలుకు టీటీడీ వారు రాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలి



నిరసన తెలియజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: బ్రిజ్ భూషణ్‌సింగ్‌ని తక్షణమే అరెస్ట్ చేయడంతో పాటు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సభ్యులు సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, భారతదేశంలో గోవుకి ఇచ్చిన రక్షణ మహిళలకు ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. ఒలింపిక్స్‌లో ఎన్నో పతకాలు సాధించిన రెజ్లర్లు 23 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.రాము, కాంగ్రెస్ నాయకుడు సతీష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి రాంబాబు, సీఐటీయూ నగర కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సీహెచ్ పావని, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అలసత్వంపై నిలదీత



బిల్లుల చెల్లింపులపై అధికారులను నిలదీస్తున్న గోలగాం సర్పంచ్ అప్పలరాజు

గుర్ల: అభివృద్ధి పనులు పూర్తి చేసి బిల్లుల కోసం ఎం.బుక్ పెట్టకపోవడం ఏంటని పంచాయతీరాజ్ అధికారులపై గొలగాం సర్పంచ్ కలిశెట్టి అప్పలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినప్పటికీ బిల్లులు ఆన్‌లైన్ చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించిన కారణంగా బిల్లు చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో పనిచేసిన అధికారులు ఎం.బుక్‌లు ఇవ్వకపోవడం వల్లే బిల్లు చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని పీఆర్ జేఈ సాల్మన్‌రాజ్ తెలిపారు. కొండగండ్రేడు సచివాలయాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సారిక గోవింద్ అధికారులను కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహారం సక్రమంగా అందించడం లేదని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల కనీస పర్యవేక్షణ లేకపోవడం వల్ల కార్యకర్తలు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల పర్యవేక్షణ చేయాలేకపోతున్నామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శకుంతల వివరణ ఇచ్చారు. గూడెంలో జేజేఎం కింద పనులు పూర్తి చేశారు, కాని తవ్విన గోతులను సక్రమంగా పూడ్చకపోవడం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ ఎజ్జిపరుపు లక్ష్మణరావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ సూర్యనారాయణ, నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, అంబల్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం



కొత్త శింగరాయి రహదారిలో గ్రావెల్ వేస్తున్న గ్రామస్తులు

వేపాడ:

మండలంలో శింగరాయి పంచాయతీ శివారు కొత్త శింగరాయికి వెళ్లే రహదారిని గ్రామస్తులు శ్రమదానం చేసి అభివృద్ధి చేసుకున్నారు. జగ్గయ్యపేట నుంచి కొత్త శింగరాయి గ్రామానికి వెళ్లే రహదారి గుంతలతో నిండిపోవడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. స్పందించిన గ్రామ యువత, గ్రామస్తులు శ్రమదానం చేసి గ్రావెల్‌తో గోతులు పూడ్చారు. రాకపోకలకు వీలుగా తాత్కాలికంగా రోడ్డును బాగు చేసుకున్నారు. అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన రోడ్డు అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

గంట్యాడ:

పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని నరవ గ్రామంలో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీలు, కులాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సైతం పథకాలు అందుతున్నాయన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ప్రజలు సంతోషంగా ఉండడం ఎల్లోమీడియా, టీడీపీకి ఇష్టం లేదని, అందుకే ప్రతీదానికి రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఉనికి కోసం టీడీపీ పడరాని పాట్లు పడుతోందని విమర్శించారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానికులకు చెత్త బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సర్పంచ్ పతివాడ భాస్కరరావు, ఎంపీటీసీ మోపాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.